క్లుప్తంగా

ఇస్కాన్‌లో మార్మోగిన హరి నామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ స్మరణతో సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను పఠించారు. అనుగ్రహ భాషణం చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసాలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మి దేవాలయంలో సోమవారం శ్రీపంచమి పర్వదినం సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. అక్షరాభ్యాసం చేయించుకునేవారు ఉదయం 10.30 గంటల లోపు చేరుకోవాలని, 11.45 గంటలకు అక్షరాభ్యాసాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆ రోజు తెల్లవారుజామున 5గంటలకు సరస్వతి హోమం, 9 గంటలకు విద్యార్థులచే సరస్వతి పూజలు నిర్వహించనున్నామని తెలియజేశారు. ఇతర వివరాలకు 88868 88817/97032 14449 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సంతపేటలో భీమ్‌సేన్‌వార్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న భీమిలి ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు సంతపేటలో భీమ్‌సేన్‌వార్, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భీమిలి ప్రతినిధులు ఆదివారం క్యాలెండర్ ఆవిష్కరించారు. భీమ్‌సేన్‌వార్ భీమిలి వర్కింగ్ ప్రెసిడెంట్ దత్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేడ్కర్ స్థాపించిన ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియాను, ఆయన ఆలోచనలను దళిత ప్రజలలోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిల సుబ్బారావు, కోశాధికారి తీన్‌మూర్తి, కోర్‌కమిటీ ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, మురళి, పండు, శివ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వికాసానికి చిల్డ్రన్స్ క్లబ్ దోహదం



చిట్టివలసలో సమావేశమైన వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు

తగరపువలస: చిన్నారుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించేందుకు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ దోహదం చేస్తుందని క్లబ్ జిల్లా జాయింట్ సెక్రటరీ డి.శైలజ అన్నారు. వారు ఎదుర్కొంటున్న పౌష్టికాహారలోపం, మత్తు మందులకు బానిస కావడం, మొబైల్‌ఫోన్లను వదల్లేకపోవడం, చదువు పూర్తయ్యాక ఉపాధి లేక నేరప్రవృత్తి వైపు మరలడం వంటి వాటి ప్రభావం నుంచి బయటకు తెచ్చి స్నేహభావాన్ని పెంపొందించడంలో సహకారం అందిస్తుందన్నారు. చిట్టివలసలో ఆదివారం జరిగిన క్లబ్ భీమిలి జోన్ మహాసభలో ఆమె మాట్లాడారు. భీమిలిలో ఆరు క్లబ్‌లు ఉన్నాయన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి మహాసభ జరిపి పిల్లల, పెద్దల కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. చిన్నారులలో శాస్త్రీయ ఆలోచనలు, సృజనాత్మకత పెంచడం, సంస్కృతి, కళలు నేర్పించడం, క్రీడల పట్ల ప్రోత్సాహం, సమ్మర్ క్యాంపుల నిర్వహణ, మ్యాజిక్ షోల ఏర్పాటు వంటి ప్రధాన లక్ష్యాలు తీసుకుంటామన్నారు. వినోద కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు.

కమిటీ ఎంపిక

కమిటీ కన్వీనర్‌గా తేజు, కో కన్వీనర్లుగా నాగరాణి, గుణమ్మ ఎంపికయ్యారు. పెద్దల నుంచి శిరీష, లక్ష్మి, పుష్ప, దుర్గ పిల్లల అధ్యక్షునిగా యూనీస్, కార్యదర్శిగా సౌమ్య, ఉపాధ్యక్షునిగా శశాంక్, జాయింట్ సెక్రటరీగా చాందిని ఎంపిక కాగా కమిటీలోకి భావన, భానుప్రకాష్‌లను తీసుకున్నారు.

మరపురాని మధుర క్షణాలు

పూర్వ విద్యార్థుల హర్షాతిరేకాలు

ఘనంగా ముగిసిన భీమిలి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల సంరంభం



1976-79 బ్యాచ్ విద్యార్థులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

గంటలు క్షణాల్లా గడిచిపోయాయి. ఎప్పుడెప్పుడు కలుస్తామా అని నెలల తరబడి నిరీక్షించిన పూర్వ విద్యార్థులకు సమయం ఎలా గడిచిందో తెలియనే లేదు. స్నేహితుల ఆత్మీయ పలకరింపులు.. పాఠశాలలో గడిపిన నాటి రోజులు.. తరగతి గదుల్లో చేసిన అల్లరి.. మిత్రబృందం చిలిపి చేష్టలు.. అన్నీ గుర్తు చేసుకుంటూ పెద్దలంతా మళ్లీ చిన్నపిల్లలే అయ్యారు. దశాబ్దాల నాటి మిత్రులను కలుసుకున్న ఆనందంతో డ్యాన్సులు చేశారు, పాటలు పాడారు. వారి కేరింతలతో భీమిలి ఉన్నత పాఠశాల దద్దరిల్లింది. రెండు రోజుల పాటు వేడుకగా జరిగిన పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. 1960 సంవత్సరంలో చదువుకున్న వారి నుంచి దాదాపు 70 బ్యాచ్‌లకు చెందిన 500 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. తమ ఉన్నతికి కారణమైన ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సహకారం అందించిన వారికి ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గాడు అప్పలనాయుడు, మైలిపల్లి లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల శతాబ్ది ఉత్సవాల సంరంభం ముగిసిన అనంతరం మరపురాని మధుర క్షణాలను మదిలో పదిలపరుచుకుని, మళ్లీ కలుద్దామంటూ మిత్రులంతా వీడ్కోలు తీసుకున్నారు.

– భీమునిపట్నం

మాటల్లో చెప్పలేనంత ఆనందం



పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ఇంత ఘనంగా జరగడం, ఆ వేడుకల్లో మేమందరం పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ ఆనంద క్షణాలు మాకు ఎంతో అపురూపం. పాత మిత్రులను కలుసుకున్నాం. అసలు ఇలాంటి కార్యక్రమం జరుగుతుంది, దానికి ఇలా వస్తామని అనుకోలేదు. కాని ఇది నిజం కావడంతో మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది.

– జరజాపు సురేష్, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ జీఎం, హైదరాబాద్

మధుర జ్ఞాపకాలతో వెళ్తున్నాం



ఈ ఉత్సవాల్లో పాల్గొనడం, కార్యక్రమం ఇంత అద్భుతంగా జరగడం మాకు మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుంది. స్నేహితులమంతా మళ్లీ చిన్ననాటి రోజులకు వెళ్లిపోయాం. బిజీ లైఫ్‌లో ఇలాంటి వేడుకలు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయి. చాలా రోజులు ఇవన్నీ గుర్తుండిపోతాయి. అందరినీ వదలలేక వెళ్తున్నాం.

– ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్, ఫార్మా కంపెనీ జోనల్ మేనేజర్, విజయవాడ

చరిత్రలో నిలిచిపోయే విధంగా..



ఇక్కడ పాఠశాలలో జరిగిన ఉత్సవాలను మా జూనియర్స్ అత్యంగా వైభవంగా నిర్వహించారు. పాఠశాల చరిత్రలో నిలిచిపోయే విధంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. దానికి కారణమైన ప్రతి ఒక్కరూ అభినందనీయులు. నేను ఈ పాఠశాల పూర్వ విద్యార్థిని అయినందుకు గర్వంగా ఉంది.

– కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి, విశ్రాంత బీఎస్ఎఫ్ కమాండెంట్, భీమిలి

ఈ రోజు మరిచిపోలేం



మా స్కూల్ శతాబ్ది వేడుకలకు హాజరవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా. అప్పటికప్పుడు అంటే వీలయ్యేది కాదేమో, కానీ ఆరు నెలల ముందు నుంచి ఉత్సవాల గురించి తెలియజేయడంతో ఎలాగైనా రావాలని అనుకున్నా. వేడుకలకు హాజరవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. రాకపోతే ఇంత మంచి కార్యక్రమం మిస్ అయ్యేవాడిని. ఇప్పుడు అందరినీ కలిసిన ఆనందంతో, ఎన్నో జ్ఞాపకాలతో వెళ్తున్నా. ఈ రోజు మరిచిపోలేను.

– మొంగం రాము, మేనేజర్ హెచ్‌హెచ్‌వీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ బెంగళూరు

చిన్న పిల్లల్లా ఎంజాయ్ చేశాం



ఇంతకు ముందు ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నా.. శతాబ్ది వేడుకల్లో రెండు రోజులు గడిపినంత సరదాగా ఎప్పుడూ లేను. ఎంతోమంది స్నేహితులను కలుసుకున్నా. అందరం చిన్న పిల్లల్లా ఎంజాయ్ చేశాం. అద్భుతమైన ఆనందాన్ని ఇచ్చిన ఈ వేడుకను ఎవరం మర్చిపోలేం.

– చక్రధర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, యాక్సిస్ మ్యాక్స్ లైఫ్, హైదరాబాద్.

అందరి సహకారంతో ఇంత ఘనంగా..



ఈ శతాబ్ది ఉత్సవాలు అనుకున్న దానికంటే ఎంతో ఘనంగా, ఉల్లాసంగా జరిగాయి. ఉత్సవ కమిటీలో సభ్యులు, అనేక మంది పూర్వ విద్యార్థుల సహకారంతోనే ఈ వేడుక విజయవంతమైంది. వాట్సాప్ గ్రూప్‌లో ఎప్పటికప్పుడు సమాచారం పోస్ట్ చేయడం, మిత్రులు వెంటనే రెస్పాండ్ అవడం.. ఆరు నెలలపాటు ఇదొక యజ్ఞంలా జరిగింది. ప్రతి ఒక్కరూ ఎంతో బాధ్యతతో పని చేయడం వల్ల ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగిపోయింది. అందరికీ ధన్యవాదాలు.

– మైలిపల్లి లక్ష్మణరావు, ఉత్సవ కమిటీ కార్యదర్శి



వాలీబాల్ ఆడుతున్న పూర్వ విద్యార్థులు



అత్యధికంగా 42 మంది పూర్వ విద్యార్థులు హాజరైన 1985-88 బ్యాచ్



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే..



ప్రసంగిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు



సదస్సుకు హాజరైన విద్యార్థులు

కొమ్మాది: ఒత్తిడిని జయిస్తే విజయం సొంతవమవుతుందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు అన్నారు. రుషికొండలోని డా.బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవన్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్వహించిన ప్రేరణ సదస్సులో ఆయన మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురై, ఒత్తిడికి లోనవుతారని దీనివలన ఏకాగ్రత లోపిస్తుందని పేర్కొన్నారు. ఒత్తిడిని దూరం చేస్తేనే, ప్రశాంతంగా చదవగలరని తెలిపారు. ఏకాగ్రత, సమయపాలన తదితర అంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్, ఆంధ్ర యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఎం.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పద్మనాభం హైస్కూల్లో చదువుల తల్లికి పూజలు చేస్తున్న విద్యార్థులు

తగరపువలస: వసంత పంచమి వేడుకలను విద్యార్థులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణ విద్యార్థులతో సరస్వతీపూజ చేయించారు. కొత్తగా బడిలో చేరే పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పద్మనాభం హైస్కూల్లో..

పద్మనాభం: వసంత పంచమిని పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలు చేశారు. తమకు విద్యాబుద్ధులను ప్రసాదించమని విద్యార్థులు చదువులమ్మను ప్రార్థించారు.

పెన్షనర్ల సమస్యలపై 11 నుంచి ఢిల్లీలో ఆందోళనలు



గుజ్జు రామునాయుడు భవన్‌లో సమావేశమైన పీఎఫ్ పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

తగరపువలస: పెన్షనర్ల సమస్యల సాధనకు ఈ నెల 11 నుంచి ఢిల్లీలో పెన్షనర్ల కేంద్ర కమిటీ కార్యక్రమాలు చేపడుతున్నట్టు చిట్టివలస ప్రాంత ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం ప్రకటించింది. ఆదివారం గుజ్జు రామునాయుడు భవన్‌లో జరిగిన సమావేశంలో కానూరి రాంబాబు మాట్లాడుతూ 11న ధర్నా, 12న కేంద్ర కార్మికశాఖా మంత్రి, సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేసి, 13న సదస్సు నిర్వహించనున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 11న నగరంలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేయనున్నామన్నారు. చిట్టివలస నుంచి పెన్షన్‌దారులు ఈ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దామోదర బాబాజీ, మోర అప్పలరాజు, సింగిడి అప్పారావు, పంపాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

80 లక్షల మంది పెన్షనర్లకు అన్యాయం

ఆదివారం మధ్యాహ్నం జరిగిన మరో సమావేశంలో కానూరి రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీస పెన్షన్ పెంచకపోవడంతో 80 లక్షల మందికి అన్యాయం జరిగిందన్నారు. గత పదేళ్లలో పెన్షనర్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లోనూ అరకొర నిధులే కేటాయించారన్నారు. మోర అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌తో కార్మికులకు, కష్టజీవులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఇది పూర్తిగా కార్పొరేట్‌కు మేలు చేసే బడ్జెట్ అన్నారు.

టెన్నిస్‌లో రాగహర్షిణి, పరిణతి విజేతలు

విశాఖ స్పోర్ట్స్: ఆలిండియా సీనియర్ టెన్నిస్ సంఘం (ఐస్టా) ఆధ్వర్యంలో వెటరన్, చిన్నారులకు నిర్వహించిన పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విజేతలకు మాజీ డీజీపీ సాంబశివరావు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై చిన్నారులకు తల్లిదండ్రులు ఆసక్తి కలిగించాలన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు స్థానిక క్లబ్‌ల్లో 35+నుంచి 70+ వరకు ఐదు కేటగిరీలతో పాటు చిన్నారులకు అండర్ 12,14 కేటగిరీలో పోటీలు నిర్వహించారు. అండర్ 12 బాలికల టైటిల్ పోరులో రాగహర్షిణి 8–5 తేడాతో సుదీక్షపై విజయం సాధించింది. అండర్ 14 బాలికల ఫైనల్స్‌లో వి.పరిణతి 8–2తో సేవితపై విజయం సాధించింది. అండర్ 12 బాలుర విభాగంలో రేవంత్ రుషి విజేతగా నిలిచాడు. ఆఫీసర్స్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో టోర్నీ డైరెక్టర్ సతీష్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌చంద్, కార్యదర్శి డీఎస్ఎన్ రాజు, చిన్నారుల టోర్నీ పర్యవేక్షకుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



విలాస్కాన్‌పాలెంలో ప్రచారం చేస్తున్న సభ్యులు

పద్మనాభం: త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండలంలోని విలాస్కాన్‌పాలెం, మద్ది పంచాయతీ తునిపాలెం గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇంధూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు ఈ ప్రచారంలో పాల్గొన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీతలో పొందుపరిచిన వేమన పద్యాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.సురేష్ , ఎస్.శ్రీనివాసరావు, కె.లక్ష్మి, బి.అంకమ్మ, కె.రాజు, బంగారునాయుడు పాల్గొన్నారు.

పిల్లలకు బాల వికాస్ పరీక్షలు



పరీక్షలు రాస్తున్న బాలబాలికలు

భీమునిపట్నం: భీమిలిలోని సత్యసాయి సమితిలో ఆదివారం బాల వికాస్ పరీక్షలు జరిగాయి. సమితి కన్వీనర్ మొల్లి సూర్య సన్యాసిరావు మాట్లాడుతూ పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించడంలో భాగంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎలా ఉండాలి, పెద్దలు, తల్లితండ్రులు, గురువుల పట్ల గౌరవ మర్యాదలతో ఎలా మెలగాలి అన్న విషయాలపై పిల్లలకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించి, అనంతరం ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇక్కడ భీమిలి పరిధిలోని 85మంది పరీక్షలు రాస్తున్నారని, ఇది వారికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలవికాస్ కో–ఆర్డినేటర్ బగ్గం సతీష్, చిట్టివలస సమితి కన్వీనర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కూటమి ఫ్లెక్సీలు అయితే ఓకే..!



భీమిలి క్రాస్‌రోడ్డులో హోటల్‌పై కూటమి నాయకుల ఫ్లెక్సీ

తగరపువలస: అధికారులు కూటమి నాయకుల సేవలో మునిగి తేలుతున్నారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా భీమిలి నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంతో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు కూటమి నాయకుల ఫ్లెక్సీల జోలికి మాత్రం పోలేదు. ఈ ఎన్నికల కోడ్ మార్చి 8 వరకు అమలులో ఉంటుంది. ఆనందపురం మండలం భీమిలి క్రాస్‌రోడ్డు సమీపంలో వైఎస్సార్‌సీపీకి చెందిన వాటిని తొలగించి, ఓ ప్రైవేట్ హోటల్‌పై పెట్టిన ఫ్లెక్సీని మాత్రం తొలగించలేదు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకువెళ్లినా.. వినపడనట్టుగా ఊరుకోవడం గమనార్హం.

భగవద్గీత పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు, నిర్వాహకులు

మధురవాడ: విశ్వ హిందూ పరిషత్ మధురవాడ ప్రఖండ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత పఠన పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. మధురవాడ పౌర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ నాయుడు ధర్మపత్ని గంగారత్నం జ్ఞాపకార్థం వీటిని సమకూర్చారు. విజేతలకు ఈ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను ఎల్ఎస్ నాయుడు, వీహెచ్‌పీ మధురవాడ ప్రఖండ అధ్యక్షుడు నండూరి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు కె.విశ్వనాథ్ చేతుల మీదుగా అందజేశారు. వారు మాట్లాడుతూ భగవద్గీత జీవన విధానాన్ని తెలియజేస్తుందన్నారు. ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు శ్రీపాద వెంకటరమణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, బెల్లాపు పాపారావు, డాక్టర్ ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పితృవాక్య పరిపాలకుడు శ్రీరాముడు



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: శ్రీరాముడు పితృవాక్య పరిపాలకుడని, ఆయనకు ధర్మం తప్ప అర్థ, కామముల యందు ఎటువంటి మక్కువ లేని రుషి సమానుడని ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా ఆదివారం 9వ రోజు ఆయన శ్రీరాముడి గురించి వివరించారు. తండ్రిని సత్యమునందు నిలబెట్టడం అనే ధర్మం కన్నా రాజ్యము, భోగము, సంపద వంటివి చాలా అల్పమైన విషయాలుగా రాముడు భావించారని తెలిపారు. వనవాసం చేయమని తండ్రి ఆజ్ఞాపించారని కైకమ్మ చెప్పినప్పుడు ఆయన బాధ పడకుండా ధర్మము, సత్యమునే పట్టుకున్నారని..ఆయన గొప్ప ప్రవర్తన కైకమ్మను కూడా ఎంతో ఆశ్చర్యానికి గురిచేసిందని వివరించారు. శ్రీరాముడి అరణ్యావాసం గురించి లక్ష్మణుడు, సీత, కౌసల్యా దేవిలతో సంవాదము, అందులో ధర్మసూక్ష్మాలను తెలియజేశారు. ప్రవచన కార్యక్రమానికి ముందు రామయంత్రానికి పూజలు చేశారు. నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

అలల చెంత.. కేరింత















సాయంకాలం.. సాగరతీరం సందర్శకులతో సందడిగా మారింది. ఉవ్వెత్తున ఎగసిపడే అలల చెంత చిన్నా, పెద్ద కేరింతలు కొట్టారు. సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలతో ఉత్సాహంగా గడిపారు. రుషికొండ బీచ్‌లో ఆదివారం పర్యాటకుల అవధుల్లేని ఆనందాన్ని సాక్షి తన కెమెరాలో బంధించిందిలా..

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్